క్లుప్తంగా

డీసీపీని కలిసిన ఎన్ఆర్ఐ



జనగామ: జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను ఎన్ఆర్ఐ ఉడుముల ధర్మారెడ్డి, సినీ నటుడు, నిర్మాత శ్యామల గణేష్ మంగళవారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీకి పూలమొక్క అందించి మాట్లాడారు.

నివాళి



పాలకుర్తిటౌన్: ప్రముఖ జర్నలిస్టు, బహుజన మేధావి ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. ప్రభంజన్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభంజన్‌యాదవ్‌తో తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మండల కేంద్రానికి చెందిన నిరుపేద విద్యార్థి గాదెపాక దీవస్‌కుమార్ ఐఐటీలో ఉత్తమ ర్యాంక్ సాధించి హిమచల్‌ప్రదేశ్‌లోని నిట్‌లో సీట్ సాధించి రాగా మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విద్యార్థికి ఆర్థిక సాయం అందజేసి సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

గూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండె స్వామి, స్వప్నలు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. విజయ్‌కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డి మృతి తీరని లోటు

జనగామ: మేధావి వర్గాన్ని ఏకం చేయడంలో ముందుండి క్రియాశీల పాత్ర పోషించిన ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి మృతి తెలంగాణ వాదులకు తీరని లోటని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవాకం ఒక ప్రకటనలో తన సంతాపాన్ని తెలియ జేశారు. ఆయన చివరి శ్వాస వరకు తెలంగాణ అభివృద్ధి కోసం ఆలోచన చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు.

పరామర్శ


పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పసునూరి లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో పరామ ర్శించారు. ఎమ్మెల్యే రూ.5వేల ఆర్థిక సాయం పంపించగా బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుగుల నర్సింహులు, గుర్రం నాగరాజు, ఊడుగుల కిష్టయ్య, బొట్ల శంకర్ అందించారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి



దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతి కోసం తోడ్పాటు అందిస్తున్న దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జి.కళావతి సూచించారు. మంగళవారం చిన్నమడూరు హైస్కూల్‌లో తలపెట్టిన ఐఐటీ ఫౌండేషన్ కోర్సు కోసం స్థానికులైన సుప్రీం కోర్టు న్యాయవాది ఈటూరి శ్రీనివాసారావు అందించిన రూ.30 వేలను పాఠశాల అభ్యుదయవాదులు జోగేష్, గొరిగె నర్సింహ, మడిపెల్లి నర్సింహ అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందించిన దాత శ్రీనివాసారావుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుల చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన తాడూరి తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబానికి అతడి బాల్య స్నేహితులైన 1991-92 ఎస్ఎస్‌సీ(ఇప్పగూడెం జెడ్పీఎస్ఎస్) బ్యాచ్‌కు చెందిన మిత్రులు తమవంతుగా రూ.10వేల సాయం అందించారు. ఈ మేరకు మృతుడి భార్యకు ఆర్థిక సాయాన్ని మంగళవారం సముద్రాల గ్రామంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బాల్య స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందడం విచారకరమని ప్రగాఢ సంతాపం తెలిపారు. ధార్న శ్రీధర్, ఆకుల శ్రీనివాస్, రొండ్ల రాజిరెడ్డి, ఆరూరి జయప్రకాష్, పోలు మల్లేష్, ఎండీ.గౌస్ తదితరులు ఉన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది కరువు
- సమస్యల పరిష్కారంలో జాప్యం



తరిగొప్పుల పోలీస్‌స్టేషన్

తరిగొప్పుల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. సరిపడా సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో చోటుచేసుకునే సమస్యలపై స్పందించే వారు కరువయ్యారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై, ఏఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 27 మంది ఉండాలి. కానీ ఎస్సై, ఏఎస్సై, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్, 13 మంది కానిస్టేబుళ్లను నియమించడం జరిగింది. వీరిలో ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. కాగా, ప్రస్తుతం ఎస్సై, ఏఎస్సైతో కలిపి తొమ్మిది మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఒకరు కోర్టు విధులకు హాజరవుతుండగా ఒకరు సన్నిహిత, మరొకరు రైటర్‌గా విధుల్లో ఉన్నారు. మరో నలుగురు కానిస్టేబుళ్లు మాత్రమే మండలంలో శాంతి భద్రతల విధుల్లో పాటు వాహనాల తనిఖీ, రెగ్యులర్ స్టేషన్ విధులు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో పలు కారణాలు, సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించే పరిస్థితి లేకుండా పోయింది. స్టేషన్‌లో కనీస సిబ్బంది లేక పోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సరిపడా సిబ్బంది నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనిపించని గ్రామ పోలీస్

గతంలో ప్రతీ గ్రామానికి ఓ పోలీస్ అధికారిని అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసేవారు. దీంతో పల్లెల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా గ్రామాధికారులు పరిష్కరించే వారు. సిబ్బంది కొరతతో గ్రామ పోలీస్ అధికారులు లేకుండా పోయారు. ప్రతీ చిన్న సమస్యకు ప్రజలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు రాక తప్పడం లేదు.

సమస్యల పరిష్కారంలో ఆలస్యం



పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఫిర్యాదుల దర్యాప్తు, పరిష్కారంచడంలో ఆలస్యం అవుతుంది. వాహనాల తనిఖీ, గ్రామాల్లో గస్తీ, ఫిర్యాదు పరిష్కారంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సరిపడా సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు విన్నవించడం జరిగింది.

\- గుగులోత్ శ్రీదేవి, ఎస్సై

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

జఫర్‌గఢ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద పార్టీ మండల ఇన్‌చార్జ్ మారపల్లి రవి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై పార్టీ ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన బండి ఉప్పలయ్య, ముస్కు కుమార్, మండల సమ్మయ్య పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, నాయకులు అంజిరెడ్డి, నవీన్ రెడ్డి, తాటి సురేష్‌గౌడ్, పల్లె సంతోష్‌రెడ్డి, మదన్ మోహన్, రామరాజు, సారయ్య పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని



రికార్డులు పరిశీలిస్తున్న అంబికా సోని

దేవరుప్పుల: వ్యవసాయ సాగు కోసం వినియోగించే విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో నిర్వాహకులు నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లి, కడవెండి, దేవరుప్పులలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయించొద్దన్నారు. యూరియాకి లింకు పెట్టే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. ఎరువుల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా వారి అభ్యున్నతికి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రైతలు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఓ దివ్య, పలు గ్రామాల ఏఈఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జనగామ: పట్టణంలోని 30 వార్డులకు చెందిన 99 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పురపాలిక కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం పురపాలిక కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య తదితరులు ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పగిడిపాటి సుధసుగుణాకర్‌రాజు, ముస్త్యాల దయాకర్, పేర్ని స్వరూప, ఎండి సమ్మద్, మామిడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

తరిగొప్పుల: ఎమ్మెల్యే కోటాలో మండలంలో 62 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులు..ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, చిలువేరు లింగం, అంకం రాజారాం, మల్యాల సుధీర్, వెంకట్‌రెడ్డి, సంజీవ, చింతకింది సురేష్, ప్రభుదాస్, జుంలాల్ నాయక్ పాల్గొన్నారు.

మల్లేష్‌కు పురస్కారం



రఘునాథపల్లి: వెల్ది గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ముచ్చర్ల సత్తన్న పురస్కారం అందుకున్నారు. ముచ్చర్ల సత్తన్న పంచాయతీ పాట ఆవిష్కరణతో పాటు రాష్ట్రంలోని 6 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు పురస్కారాలు అందజేశారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఊరికి సేవ చేయడంలో తనకు అధికారులు, గ్రామ ప్రజలు సహకరించడంతోనే తనకు పురస్కారం లభించిందన్నారు. గ్రామ పేరును రాష్ట్ర స్థాయిలో తీసుకెళ్లిన మల్లేష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ

లింగాలఘణపురం: గొర్రెలు, మేకలకు ప్రభుత్వం వెంటనే నట్టల నివారణ, ఇతర మందులను వెంటను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జీఎంపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో రెండేళ్లుగా నట్టల నివారణ మందులను ప్రభుత్వం నిలిపి వేసిందని, అదేవిధంగా పాడి పశువులకు సంబంధించిన మందులను కూడా సరఫరా చేయడం నిలిపి వేశారని, వెంటనే మందులను పంపిణీ చేయాలని, అదేవిధంగా గొర్రెల కోసం చెల్లించిన డీడీలను కొంత మందికి తిరిగి ఇవ్వడంలేదని, వారికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి మొటికె తిరుపతయ్య, గాదరి నాగయ్య, దయ్యాల మల్లేశం, గవ్వల భిక్షపతి, నోముల కొంరయ్య, గణేష్, కృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవాని పండుగ



సీత్లా వద్ద పూజలు చేస్తున్న గిరిజనులు

తరిగొప్పుల: మండలంలోని భోజ్యాతండాలో మంగళవారం సీత్లా భవాని పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆరాధ్య దేవతలను ఏడుగురిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు, చప్పుళ్లతో యువతులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేసుకుంటూ దేవతల వద్దకు సమూహంగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

పాలకుర్తి టౌన్: కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై మలిదశ ఉద్యమానికి సన్నద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ అన్నారు. మంగళవారం గూడూరు గ్రామంలో దేశ రైతాంగం ఎదురుకొంటున్న 'సవాలు పరిష్కార మార్గాలు-మన కర్తవ్యం 'అనే అంశంపై రైతు సదస్సు ముస్కు ఇంద్రారెడ్డి అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. రైతు సంఘం జిల అధ్యక్షుడులు రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు బచ్చు శ్రీలత, శ్రీను, రవి, భాస్కర్, రాజు, సమ్మయ్య, సోమయ్య పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం'



బచ్చన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని టీబీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆగస్టు 28న నిర్వహించే రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రాజు, ఎల్లయ్య, భిక్షపతి, రవీందర్, రాజు, అబ్బసాయిలు, రాజ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

'పాత నిధుల వెల్లడి హాస్యాస్పదం'

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో కొత్తగా పైసా మంజూరు చేయలేని దుస్థితుల్లో ప్రజల్ని మభ్యపెట్టేందుకు పాత నిధుల మంజూరులను కొత్తవిగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మాజీ మంత్రి దయాకర్‌రావు రెండున్నర కోట్లతో పనులు ప్రారంభిస్తే మిగులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించారని, మీదుగా అదే నిధులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోటి మంజూరు చేసినట్టు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తీగల దయాకర్, చింత రవి, సోమన్న, బస్వ మల్లేషమ్, అర్జున్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆదర్శ ముఖ్యమంత్రి అచ్యుతానందన్

జనగామ రూరల్: దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం మృతి చెందిన కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు అచ్యుతానందన్ సంతాప సభను జిల్లా కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతానందన్ చిత్రపటానికి కనకారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సాంబ రాజు యాదగిరి, బూడిద గోపి, సుంచు విజేందర్, బోడ నరేందర్, ఎండీ అజారుద్దీన్, కల్యాణం లింగం బూడిది ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాకవి దాశరథి రచనలు చిరస్మరణీయం

దేవరుప్పుల: ఆనాడే నా తెలంగాణ కోటి రతనాల వీణ అని అభివర్ణించిన మహనీయుడు దాశరథి కృష్ణమాచార్యుల రచనలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల శతాబ్ది జయంతి పురస్కరించుకుని పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు మల్లేష్, మాజీ ఎంపీపీ సోమన్న, గండిపెల్లి యాకన్న, భిక్షపతి, సత్తయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్న నిర్వహించారు. ఈసందర్భంగా మండల కమిటీ సభ్యుడు కడారి ఐలయ్య మాట్లాడుతూ ప్రత్యేకాధిపాలన వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగి పోయాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేద్దామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓకు మెమోరాండం సమర్పించారు. కేరళ మాజీ సీఎం, సీపీఎం నేత అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న పరశురామ్ తదితరులు

పాలకుర్తి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, వన మహోత్సవంలో 400 మొక్కలు నాటాలని అగ్రికల్చర్ సహాయ సంచాలకులు ఆజ్మీర పరశురామ్ అన్నారు. మంగళవారం పాలకుర్తి మండలం పాలకుర్తి, ముత్తారం, గూడూరు రైతువేదికల్లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పరశురామ్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్క నాటితే సమాజంలో చల్లని వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఏఓ విజయ సాయి రెడ్డి, ఏఈఓలు రాధిక, వెంకటేశ్, మహేశ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

చిల్పూరు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని చిల్పూరు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం ఆలయ భూమిలో చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎంపీఓ మధుసూదన్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, ధర్మకర్తలు గోలి రాజశేఖర్, రత్నాకర్‌రెడ్డి, గణగోని రమేష్, కొలిపాక రాజయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

పోచన్నపేటలో..

బచ్చన్నపేట: ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి అన్నారు. పోచన్నపేట గ్రామంలోని రైతు వేదిక భవనం వద్ద ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ఏఈఓ హారిక, రైతులు సిద్దారెడ్డి, మహేందర్‌రెడ్డి, శివరాములు, మల్లేశం పాల్గొన్నారు.

దేవరుప్పుల: హరిత హారాన్ని విస్మరిస్తే ప్రాణ వాయువు(ఆక్సిజన్) కరవు అవుతుందని మండల వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. విజయ డెయిరీ జిల్లా చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, ఎఈఓలు సాగర్, భాస్కర్, ఆగ్రోస్ నిర్వహకులు గిరి యాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి

నర్మెట: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య, హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు (హైదరాబాద్) అధ్యక్షుడు మూడె రవి నాయక్ అన్నారు. వెల్దండ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు ఇ.అమృత, ఎ.మౌనిక (విద్యుత్ శాఖ) అందించిన నోటు పుస్తకాలను మంగళవారం వారు అందజేసి మాట్లాడారు. హెచ్ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు సామ్యూల్ ఆనంద్, విజయ, రమేష్, తిరుమల్ రెడ్డి, కృష్ణమూర్తి, బాల సిద్దులు, మాధవి, మహేందర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొడకండ్ల: ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త వహించవచ్చని వైద్యాధికారి హరికృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గిర్నితండాలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రక్తదానం

జనగామ రూరల్: గుగులోత్ కిరణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సేవాలాల్ సేన జిల్లా యువజన అధ్యక్షుడు తేజావత్ మోహన్ నాయక్, గణేష్ నాయక్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అస్పత్రిలో రక్తదానం చేశారు. మంతెన మణికుమార్, భీమ్‌రాజ్, సుమన్ నాయక్ పాల్గొన్నారు.

నేటి బంద్‌ను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23(బుధవారం)న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం డీ.యూనస్ కోరారు. ఘన్‌పూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా పాలకులు విద్యాసంస్థల్ని పట్టించుకోవడం లేదన్నారు.

విజయవంతం చేయాలి

రఘునాథపల్లి: సిద్దిపేల జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన నిర్వహించే టీబీఎస్‌ఆర్‌కేఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆయన ఆవిష్కరించారు.

ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మ దహనం

జనగామ రూరల్: ఒడిశాలో వరుసగా జరుగుతున్న వివిధ అత్యాచారాల్లో ఎన్ఎస్‌యూఐ నాయకుల హస్తం ఉండటాన్ని నిరసిస్తూ మంగళవారం ఆర్టీసీ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గుంటుపల్లి కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుల పేరుతో ఎన్ఎస్‌యూఐ లీడర్లు అమ్మాయిలను అత్యాచారం చేయటం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

తాటికొండలో వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులతో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పలువురికి డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలోని కస్తూర్బాలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా ప్రారంభించిన ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ కోర్సులో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ జ్యోతి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఎంఎల్‌టీ కోర్సులో చేరేందుకై ఆసక్తి కలిగిన వారు వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందాలని, వివరాల కోసం 9505798098, 9908413707 నంబర్లకు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి పుష్పాలంకరణ



జనగామ రూరల్: బాలాజీ నగర్ 3వ వార్డులో వెలిసిన రేణుకా ఎల్లమ్మ తల్లికి అషాఢమాసం చివరి మంగళవారం సందర్భంగా అర్చకుడు మారుపాక శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పాలతో అలంకరించి అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు మొక్కులు చెల్లించారు.

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

జనగామ రూరల్: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎస్ఓ రాణి అన్నారు. మంగళవారం చౌడారం కేజీబీవీ పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించి సూచనలు చేసి మందులు అందజేశారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కన్వీనర్‌గా ఛాగల్లుకు చెందిన కనకం గణేష్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు.

బస్టాండ్‌లోనే అన్ని బస్సులు నిలపాలి

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోనే అన్ని బస్సులు నిలపాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పట్టపూరి సదయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు హనుమకొండ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

న్యాయం చేయాలి

చిల్పూరు: 35 ఏళ్లుగా తమ పొలంలోకి వెళ్లే బాటను అన్న చేరాలు, అన్న కుమారుడు కృష్ణ కలిసి అక్రమంగా దున్ని దారి లేకుండా చేసి వారి పొలంలో కలుపుకోవాలని చూస్తున్నారని, పూర్తి స్థాయిలో విచారన చేపట్టి న్యాయం చేయాలని పల్లగుట్టకు చెందిన బాధిత రైతు కన్నెబోయిన రమేష్-కొమురమ్మలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

జఫర్‌గఢ్: తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికలపై మంగళవారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల పక్రియ, ఓటింగ్ విధానం, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం షారోన్ మాట్లాడుతూ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే మాక్ పోలింగ్‌ను నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కాగా, విద్యార్థుల చేత మాక్ పోలింగ్ పక్రియను హిమ్మత్‌నగర్ పాఠశాల హెచ్ఎం మంగు జయప్రకాశ్, ఉపాధ్యాయులు పిట్టల మహేందర్, నాగుల లక్ష్మీప్రసన్న చేపట్టారు.

పౌష్టికాహారం అందించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంల్లో 7వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.